క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఖమ్మంవైద్యవిభాగం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చే నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పిన్నింటి రమ్య ఆశ వర్కర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ముస్తఫానగర్ పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశవర్కర్లకు అందించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణ, విజయ, నిర్మల, శేషిరేక, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



అవగాహనలో పాల్గొన్న రైతులు, అధికారులు

కూసుమంచి: మండలంలోని కేశ్వాపురం, గోపాలరావుపేట గ్రామాల్లో మంగళవారం ఎస్‌బీఐ ఫౌండేషన్ సౌజన్యంతో నేరుగా వరివిత్తే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. భారత వరి పరిశోధన సంస్థ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ కవిరాజు, మండల వ్యవసాయాధికారిణి వాణి పాల్గొని రైతులకు పలు అంశాలను వివరించారు. నేరుగా వరిని నాటటం వల్ల కూలీల సమస్యను అధిగమించవచ్చని, నాటుకూళ్లు ఉండవని, ఫలితంగా ఎకరాకు రూ.7వేల వరకు ఖర్చులు ఆదాకావడంతో పాటు పంట కూడా నెల ముందు చేతికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రవిందర్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

వార్డుల విభనజపై అభ్యంతరాలు తెలపాలి

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీలో ఏ వార్డులో ఏఏ ఏరియాలున్నాయో అనే విషయాలను ఆయా వార్డుల్లో ప్రచురించామని, ఇందులో ఏమైనా అభ్యంతరాలుంటే అయిదు రోజుల్లోగా తెలపాలని కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. పెదతండాలోని మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే వార్డుల విభజనకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ఆయన బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాలన సౌలభ్యం కోసం గత కొద్దిరోజుల క్రితం బీఎల్ఓలతో వార్డుల ప్రక్రియ చేపట్టి ముసాయిదా తయారు చేసినట్లు తెలిపారు. ఈనెల 5 నుంచి 11 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి 17న తుది ముసాయిదాను జిల్లా కలెక్టర్‌కు, అప్రూవల్ కోసం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు పంపనున్నట్లు తెలిపారు. అప్రూవల్ వచ్చాక చివరి డ్రాఫ్ట్ వివరాలు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

కేటీఆర్‌తో నగరవాసులు

ఖమ్మంఅర్బన్: అమెరికా పర్యటనలో భాగంగా మాజీ ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) టెక్సాస్‌లోని రిచర్డ్సన్‌లో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ (యూటీ డల్లాస్) క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ తెలుగు విద్యార్థులతో ముచ్చటించారు. విద్య, వృత్తి అవకాశాలపై వారి అభిప్రాయాలు తెలుసుకుని, భవిష్యత్ లక్ష్యాలపై వారిని ప్రోత్సహించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన మెంటం యశ్వంత్ తదితరులు ఉన్నారు.

వానొ(గొ)స్తే వణుకే..



చౌటపల్లి-బీరోలు రహదారిలో ప్రవహిస్తున్న వాగు(ఫైల్)



చౌటపల్లి వద్ద వాగులో చిక్కిన ట్రాక్టర్(ఫైల్)

- హైలెవల్ కాజ్‌వేలు లేక ప్రజల కష్టాలు
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణం
- చోద్యం చేస్తున్న అధికారులు, పాలకులు

కూసుమంచి: వాగులు ఉప్పొంగితే ఆయా గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ఇటీవల దాక కురిసిన భారీ వర్షాలకు ఉన్న చప్టాలు కాస్త ధ్వంసమవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాగుల ప్రాంతంలో హైలెవల్ కాజ్‌వేలు నిర్మిస్తే తప్ప వారి కష్టాలు తీరేలా లేవు. వర్షాకాలం ప్రారంభమైనందున మళ్లీ గత సమస్యలు పునరావృతమయ్యేలా ఉన్నాయని వాపోతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించి తమ సమస్యలను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

హైలెవల్ కాజ్‌వే లేక..

మండలంలోని నర్సింహులగూడెం-కొత్తూరు రహదారిలో వాగుపై హైలెవల్ కాజ్‌వే లేక వర్షాలు వచ్చినప్పుడు వరదనీరు రహదారిని ముంచెత్తుతోంది. దీంతోరాకపోకలకు అంతరాయం కలుగుతూ ప్రాంత వాహనదారులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. వర్షాకాలం వరి పొలాలగుండా వరద ఉధృతంగా ప్రవహిస్తుండగా వాహనాలు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ రహదారిలో కొత్తూరు, ఎర్రగడ్డతండాలో పాటు సమీప సూర్యాపేట జిల్లాకు రవాణా సౌకర్యం ఉండగా.. బస్సులు, బడి వ్యాన్‌లు వచ్చిపోతుంటాయి. అంతేకా పలువురు వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం రైతులు, ఇతరులు ఈ వాగు దాటే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఏటేటా వీరికి కష్టాలు తప్పడం లేదు.

సమస్యాత్మక ప్రాంతాలివే..

- మండలంలోని నాసుతండా వద్ద పాలేరు-బంగ్లా రహదారిలో ఇటీవల భారీ వర్షాలకు వాగు వద్ద రహదారి కూడా కొట్టుకుపోగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ పాలేరు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ ఉధృతి ఉన్నప్పటికీ లోలెవల్ కాజ్‌వేతోనే సరిపుచ్చారు.
- ఇక జుజుల్‌రావుపేట వద్ద జాతీయ రహదారి అండర్‌పాస్ వద్ద వర్షాకాలం పాలేరు రహదారిలో వాగు ప్రవహిస్తుంది. దీంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది.
- నర్సిహులగూడెం గ్రామం వద్ద కిష్టాపురం రహదారిలో ఇటీవల కొత్తగా లోలెవల్ కాజ్‌వే నిర్మించినా.. వాగు ఉధృతంగా ప్రవహిస్తే కాజ్‌వే మునిగి రవాణా స్తంభిస్తుంది.
- మండలంలోని చౌటపల్లి గ్రామ శివారులోని బీరోలు రోడ్డులో ఉన్న వాగు వద్ద కొద్దిపాటి వర్షాలకే వాగు రోడ్డుమీదుగా ప్రవహిస్తుంది. ఈ నీటి ప్రవాహంలో 2022లో ఓ ట్రాక్టర్ కొట్టుకుపోతుండగా స్థానికులు కొట్టుకుపోకుండా చేశారు. ఇక్కడ కాజ్‌వే నిర్మించకపోవడంతో కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల ప్రజలు, రైతులకు వాగు దాటాలంటేనే భయపడాల్సి వస్తుంది.



కొత్తూరు రహదారిలో దెబ్బతిన్న చప్టా

సమస్య తీర్చాలి..

నర్సింహులగూడెం-కొత్తూరు గ్రామాల మధ్య హైలెవల్ కాజ్‌వే లేక వర్షాలు పడినప్పుడల్లా రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. వాగు ఉధృతంగా వస్తే ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంది. హైలెవల్ కాజ్‌వే నిర్మించి కష్టాలు తీర్చాలి.

– సత్యనారాయణరెడ్డి, కొత్తూరు

భయపడాల్సి వస్తోంది..

మా పొలానికి వాగు దాటి వెళ్లాలి. వర్షాకాలంలో వాగొస్తే భయపడాల్సి వస్తోంది. వాగుపై బ్రిడ్జి లేక ఇబ్బంది పడుతున్నాం. ట్రాక్టర్లు, బండ్లు, పశువులు కొట్టుకుని పోతున్నాయి. రైతులం రోజూ పొలాలకు వెళ్లాలి కాబట్టి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

– సోమనపల్లి వెంకన్న, చౌటపల్లి

డివిజన్లలో అధికారుల పర్యటన



13వ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్, కమిషనర్

ఖమ్మంఅర్బన్: నగరాన్ని ఆరోగ్యకరమైన వాతావరణంగా తీర్చిదిద్దేందుకు వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా తదితరులు పలు డివిజన్లలో పర్యటించి పరిశుభ్రత కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్, మేయర్‌లు మాట్లాడుతూ.. నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, డ్రై క్లీనింగ్, బుష్ కట్టింగ్, ఓపెన్ ప్లాట్ క్లీనింగ్, దోమల నివారణ చర్యలు నిరంతరాయంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. అనంతరం 13వ, 21వ, 37వ, 50వ డివిజన్లలో ప్రత్యేకంగా 20 మంది వర్కర్లతో గ్యాంగ్‌వర్క్ బృందాలు ఏర్పాటు చేసి, వారికి ట్రాక్టర్, జేసీబీ, అవసరమైన పరికరాలు కల్పించారు. విధులపట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కార్పొరేటర్ కొత్తపల్లి నీరజ, శానిటరీ అధికారి సాంబయ్య, బెల్లం రాధిక తదితరులు ఉన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి



నియామక పత్రం అందజేస్తున్న జగదీష్

ఖమ్మం మామిళ్లగూడెం/రఘునాథపాలెం: తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘ నగర కమిటీ అధ్యక్షుడు యలమందల జగదీష్ కోరారు. నూతనంగా ఎన్నికైన రఘునాథపాలెం మండల నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాచమళ్ల శంకర్, కార్యదర్శి నీడిగొండ వెంకటేశ్వర్లుకు మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో నియామక పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మండల కమిటీ ఆధ్వర్యాన యలమందల జగదీష్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నంద్యాల నరసింహారావు, జిల్లా నాయకులు రావులపాటి శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు నంద్యాల రాము, సురభి సైదులు, అద్దంకి పాపారావు, శ్రీ రాములా విజయ్, సురభి సందీప్, చిట్యాల సైదాబాబు, కొల్లపాక గౌస్ బాబు, ఆర్. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలను తరిమికొడదాం



సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

రఘునాథపాలెం: సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వాడకాన్ని, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌లను యువత చైతన్యంతోనే సమూలంగా తరిమికొట్టాల్సిన అవసరం ఉందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతా రమేష్‌లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలు వద్దు.. పోరాటాలే ముద్దు అనే నినాదంతో డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన కొనసాగుతున్న యువ చైతన్య సైకిల్ యాత్ర ఐదోరోజు మంగళవారం మండలంలోని మంచుకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటానికి సంఘీభావంగా స్థానిక నేతలు, సంఘాలు పాల్గొన్నారు. ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంఏ జబ్బార్, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.నవీన్ రెడ్డి, డీవైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు షేక్ షరీఫ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, జిల్లా నేతలు శీలం వీరబాబు, సత్తనపల్లి నరేష్, గుమ్మ ముత్తారం, కొట్టు మధు, మండల కార్యదర్శి కూచిపూడి నరేష్, మండల నాయకులు ఇమామ్, శీను, తిరపయ్య, మంగ, సక్కుబాయి, ఖాదర్, వసంత పాల్గొన్నారు.

భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభం

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మిస్సింగ్ భూమి వివరాలు, తప్పుగా ఉన్న సర్వే నంబర్లు, పెండింగ్ మ్యూటేషన్, సక్సేషన్, సర్వే నంబర్ మిస్ మ్యాచ్ వంటి సమస్యలపై అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

» ఖమ్మంరూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతిలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల్లో లేని భూసమస్యలు పరిష్కారమవుతాయని మండలంలోని బారుగూడెం, పల్లెగూడెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. తొలిరోజు బారుగూడెంలో 39, పల్లెగూడెంలో 15 దరఖాస్తులు అందాయన్నారు. మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.హరినాథ్ బాబు, ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

» కూసుమంచి: మండలంలోని మునిగేపల్లి, నాయకన్‌గూడెం రెవెన్యూ గ్రామాల పరిధిలో తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ ఆధ్వర్యాన రెండు బృందాలుగా సదస్సులను నిర్వహించారు. దీనిలో భాగంగా తొలిరోజు రెండు రెవెన్యూ గ్రామాల నుంచి 85 మంది దరఖాస్తు చేసుకోగా.. వీటిలో వారసత్వ భూముల నమోదుకు 28, భూముల విస్తీర్ణం సవరణలకు 7, ఇతర కారణాలతో సవరణలకు 48, మిస్సింగ్ సర్వే నంబర్ల సవరణకు 2 దరఖాస్తులు వచ్చాయి.



కూసుమంచి: నాయకన్‌గూడెంలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

» ఖమ్మంఅర్బన్/ రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెం, కోయచలక, ఖమ్మంఅర్బన్‌లో అల్లీపురం రైతు వేదికల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈనేపథ్యాన వి.వెంకటాయపాలెంలో తహసీల్దార్ ఎస్.శ్వేత, కోయచలకలో డిప్యూటీ తహసీల్దార్ మురళీధరరావు, ఆర్‌ఐలు ప్రవీణ్, సత్యనారాయణ, అల్లీపురంలో డిప్యూటీ తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ వాహిద్‌ల ఆధ్వర్యాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వి.వెంకటాయపాలెంలో 139, కోయచలకలో 65, అల్లీపురంలో 328 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గ్రామసభలో అత్యధికంగా సాదాబైనామా భూములు హక్కుల కోసం, ఇనాం భూములకు పట్టాల కోసం తదితర వాటిపై అత్యధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీవీపాలెం పరిధిలో కొంత మంది గజాల్లో భూములకు ప్లాట్లు చేసి అమ్మకాలు చేసి మళ్లీ వ్యవసాయ భూములుగా హక్కులు కోసం దరఖాస్తులు చేసినట్లు తెలిసింది. ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతురావు, కార్పొరేటర్లు ఆర్.కరుణసైదబాబు, ఎం.వెంకటేశ్వర్లు, వీవీపాలెం సొసైటీ చైర్మన్ ఆర్.సైదబాబు, వ్యవసాయ అధికారులు, ఏఈఉ పాల్గొన్నారు.



వీవీపాలెంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

» తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి, సుబ్లేడు గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా.. కొక్కిరేణిలో 90 మంది, సుబ్లేడులో 91 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ విల్సన్ తెలిపారు. ఇందులో ఎక్కువగా సాదాబైనామా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ ఆర్‌ఐలు రేసు వీరయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.



తిరుమలాయపాలెంలో..

» కామేపల్లి: మండలంలోని గరిడేపల్లి, మద్దులపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ.. భూమి కలిగి ఉండి పాస్ పుస్తకం లేని రైతులు తమ భూమికి సంబంధించిన పత్రాలను దరఖాస్తుకు జతచేసి అందించాలన్నారు. కాగా, రెండు గ్రామాల్లో మొత్తం 124 దరఖాస్తులు రాగా వీటిలో 123 సాదాబైనామా, 38ఇ పట్టా 1 వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుధాకర్

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



నేలకొండపల్లిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ రాధ

ఖమ్మంరూరల్/కామేపల్లి/నేలకొండపల్లి: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, విత్తనాల ఎంపికతోనే అధిక దిగుబడి సాధించవచ్చని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండలాల్లోని రైతు వేదికలో మంగళవారం విత్తనాలను పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈనేథ్యాన ఖమ్మంరూరల్ మండలం పొన్నేకల్ రైతువేదికలో ఏఓ ఉమానగేష్, కామేపల్లి రైతు వేదికలో కొండాయిగూడెం సొసైటీ చైర్మన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నేలకొండపల్లిలో మండల వ్యవసాయాధికారి ఎం.రాధ మాట్లాడారు. సీజన్ ప్రారంభమైనందున్న విత్తనాలు కొనుగోలు సమయాన ప్రభుత్వం అనుమతి పొందిన విత్తనాలనే తీసుకోవాలని, కొన్న ప్రతీ వస్తువు రశీదును భద్రపరచుకోవాలని సూచించారు. ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాల్లో ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయిని హెచ్చరించారు.

ఈ కార్యక్రమాల్లో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బి.హరినాథ్‌బాబు, సరిత, ఇల్లెందు ఏఎంసీ డైరెక్టర్ మాలోత్ బాన్‌సింగ్, సీఈఓ గాదె నాగయ్య, భూక్యా సీతారాములు, దమ్మలపాటి సత్యనారాయణ,నల్లమోతు లక్ష్మయ్య, ఏఈఓలు అవినాష్, అరవింద్, శిరిషా, ఉష, శ్రీకన్య, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను ముందే అరికట్టాలి

తిరుమలాయపాలెం: ఖరీఫ్ ప్రారంభమవుతున్న తరుణంలో ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బచ్చోడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగానికి అవసరమైన విత్తనాలను ఎరువులను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి పత్తి మిరప గింజలు మార్కెట్లోకి వచ్చి రైతులను మోసం చేస్తూ విత్తనాలను అమ్మకం చేస్తున్నారని ప్రభుత్వం గట్టి నిఘా పెట్టి నిరోధించాలని డిమాండ్ చేశారు.

వినతులు

» పారదర్శకంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: రానున్న విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు చేపట్టే సర్దుబాటు ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావులు తెలిపారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల నమోదు ఆధారంగా పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలని, సమగ్ర కుటుంబ సర్వే పైకం వెంటనే చెల్లించాలని కోరారు. నమోదు పెంచేందుకు 2కే రన్ నిర్వహించాలని, అధికారులను బడిబాటలో భాగస్వామ్యం చేయాలని, మౌలిక వసతులను కల్పించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నాయకులు నాగేశ్వరరావు, సురేష్, నాగూర్ వలీ, రామకృష్ణ, రాంబాబు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులున్నారు.

» మూసివేసిన పాఠశాలలు తెరిపించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రవ్యాప్తంగా మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని, అనుమతులు లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన డీఈఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటుంటే ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకుండా.. విద్యార్థులు లేరనే సాకుతో 2వేల పాఠశాలలను మూసివేయడం విద్యార్థుల భవిష్యత్తును ఆగం చేయడమేనన్నారు. ముందస్తుగా అడ్మిషన్లు క్లాసులు నడిపిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీకాంత్, అజయ్, సందీప్, నాగార్జున పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంగళవారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి సిఫారసుతో చెక్కు మంజూరు కాగా అనేక మంది లబ్ధిదారులకు ఆర్థిక చేయూత కలుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రతాపనేని రఘు, లింగయ్య, దాసరి వెంకటనారాయణ, జి.నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

» ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు..

కామేపల్లి: మండలంలోని పింజరమడుగు, మద్దులపల్లి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని నాయకులు కోరారు. కామేపల్లి పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి సత్యనారాయణ, రెడబోతు గోపీరెడ్డి, వంకాయలపాటి సత్యనారాయణ, గుగులోత్ భాషా, నారాయణరెడ్డి, వీరబాబు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

» రోడ్డుపై చెత్త వేసిన వారికి జరిమానా



జరిమానా రశీదు అందిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 45వ డివిజన్ పాత బస్టాండ్ వెనుక రోడ్డులో భవన వ్యర్థాలు, చెత్త పోసిన వారికి కేఎంసీ శానిటేషన్ అధికారులు జరిమానా విధించారు. భవన వ్యర్థాలు పోసినందుకు రూ.2,500లు, చెత్త పోసినందుకు రూ.1,000లు, ఇసుక పోసినందుకు రూ.3 వేలు చొప్పున ముగ్గురికి జరిమానా విధించారు. రోడ్డు వెంట వ్యర్థాలు పోస్తే జరిమానతో మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

» వీధి దీపాల ఏర్పాటు..

15, 16, 27, 38 డివిజన్లలో వెలగని విద్యుత్ దీపాల స్థానంలో కొత్తవాటిని అమర్చారు.

» రికార్డులు సమర్పించాలి..

రెవెన్యూ విభాగానికి సంబంధించిన రికార్డులను సమర్పించాలని విజిలెన్స్ అధికారులు కేఎంసీ అధికారులను కోరారు. గతంలో కేటాయించిన అసెస్మెంట్ల నంబర్లకు సంబంధించిన రికార్డులు ఇవ్వాలని కోరుతూ అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లాను విజిలెన్స్ అధికారులు మంగళవారం కలిశారు. రికార్డులు సిద్ధంగా లేవని, రెండుమూడు రోజుల్లో అందజేస్తామని అధికారులు తెలిపినట్లు సమాచారం. విజిలెన్స్ అధికారులు కోరిన రికార్డులను విభాగం నుంచి 24 గంటల్లో అందజేయాలని ప్రస్తుతం ఉన్న ఆర్ఓ, ఆర్‌ఐలకు ఏఎంసీ సూచించినట్లు తెలిసింది.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్య, సదుపాయాలను వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి మంచి విద్య పొందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు తులసి, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ఆదమరిస్తే అంతే సంగతి..!



రఘునాథపాలెం మండలం బొరియాతండ నుంచి తనికెళ్ల వెళ్లే దారిలో ఎన్నెస్పీ కాల్వపై ఉన్న బ్రిడ్జి ప్రమాదంగా తయారైంది. పలు వాహనాలు బ్రిడ్జిపై ఉన్న సైడ్ వాల్‌ను ఢీకొట్టడంతో రెండువైపులా సగం వరకు విరిగిపోయాయి. దీంతో సైడ్‌వాళ్లు లేవు. అంతేకాక బ్రిడ్జి సమీపాన మూలమలుపు కూడా ఉండడంతో వాహనదారులు గమనించకుండా వస్తే కాల్వలో పడే ప్రమాదం ఉంది. రాత్రి సమయాల్లో అప్రమత్తం లేకపోతే ఇక అంతే సంగతి. ఇప్పటికైనా బ్రిడ్జికి సైడ్‌వాల్స్ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్